06ATP27_06ATP27.qxd 02-12-2024 PM 10:42 Page 1



# సైనిక సంక్షేమ నిధికి చేయూతనివ్వండి కలెక్టర్ చేతన్



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ చేతన్

పుట్టపర్తి కలెక్టరేట్, డిసెంబర్ 2 ప్రభాతవార్త

సైనిక సంక్షేమ నిధికి విరివిగా విరాళాలు అందించి, డిసెంబర్ 7న సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ టిఎస్ చేతన్ విజ్ఞప్తి చేశారు. సోమవారం ఉదయం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా సైనిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సాయిధ దళాల పతాక దినోత్సవాన్ని పురస్కరించుకొని రూపొందించిన స్టిక్కర్లు, కార్ ఫ్లాగ్స్, వివిధ ప్రచార సామాగ్రిని జిల్లా కలెక్టర్ టి ఎస్ చేతన్ ఆవిష్కరించారు. జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డిఆర్ఓ విజయసారథి, పుట్టపర్తి ఆర్డిఓ సువర్ణ, జిల్లా సైనిక సంక్షేమ శాఖ సీనియర్ సహాయకులు గిరీష్, తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లా ప్రజలు సాయుధ దళాలలో పనిచేస్తున్న సైనికులకు సంఘీభావాన్ని ప్రకటించి మాజీసైనికుల పునరావాస కార్యక్రమంలో అమరులైన వీర జవాన్లకు, వితంతువులకు, కుటుంబ సభ్యులను ఆదుకునేందుకు విరాళాలు అందించాలని కలెక్టర్ కోరారు. దేశ సాయుధ దళాలు యుద్ధంలో వీరోచితంగా పోరాడుతూ దేశసేవ చేస్తున్నారని, మాతృదేశం కోసం ప్రాణ త్యాగంచేసిన వీరసైనికులు, వారికుటుంబసభ్యులపట్ల దేశప్రజల బాధ్యతను ఈ పతాక దినోత్సవం గుర్తు చేస్తుందని కలెక్టర్ పేర్కొన్నారు. ఆర్మీ, వైమానిక, నౌకా దళాలకు చెందిన సైనికులు అహర్నిశలు దేశం సరిహద్దుల్లో శత్రువులు మాతృభూమిలోకి చొరబడకుండా, భూభాగాన్ని, గగన తలాన్ని, సముద్రతీరాలపై ఎంతో అప్రమత్తంగా ఉండి కాపాడుతున్నారన్నారు. వీర జవాన్లకు దేశ ప్రజలందరూ నివాళులు అర్పించే రోజే సాయుధ దళాల దినోత్సవంఅని కలెక్టర్అన్నారు. ముఖ్యంగా ప్రకృతి వైపరీత్యాలు, వరదలు, భూకంపాలు, తుఫానులు సంభవించినప్పుడు ప్రాణాలకు తెగించి సైనిక దళాలు చేపట్టిన సహాయ కార్యక్రమాలు దేశ ప్రజల మన్ననలను చూరగొంటున్నాయని కలెక్టర్ తెలిపారు. దేశ సేవలో భాగంగా సైనిక దళాలు చేస్తున్న సేవలు చిరస్మరణీయమైనవిగా కలెక్టర్ అభివర్ణించారు. సాయుధ దళాల పతాక దినోత్సవాన్ని పురస్కరించుకొని మాజీ సైనికులు, యుద్ధ సమయంలో మరణించిన వారి వారసుల సంక్షేమం కోసం జిల్లాలోని ఎన్. సి. సి, ఎన్ఎస్ఎస్ విద్యార్థులు హుండీ ద్వారా ప్రజల నుండి విరాళాలను సేకరిస్తారన్నారు. స్టిక్కర్లను, కార్ ఫ్లాగ్స్ ఆయా ప్రభుత్వ , ప్రైవేటు సంస్థలకు పంపి వాటి అమ్మకం ద్వారా వచ్చిన ఆదాయాన్ని విరాళంగా స్వీకరిస్తారని కలెక్టర్ తెలిపారు. విరాళాలను జిల్లా సైనిక సంక్షేమ శాఖ, ఎస్ బి ఐ ఖాతా నెం. 62076956433 ఐఎఫ్ఎస్ సి కోడ్. ఎస్బిఐఎన్ 0021438 ద్వారా కూడా అందించవచ్చునని కలెక్టర్ తెలిపారు.

# అగ్రహారం ఆసుపత్రికి మహర్దశ

తాడిమర్రి, డిసెంబర్ 2 ప్రభాతవార్త



అవార్డుకు ఎంపికైన వైద్య సిబ్బంది

మండలంలోని అగ్రహారం గ్రామంలోని ఆయుష్ మాన్‌భవ ఆసుపత్రికి మహర్దశ వచ్చిందని డా.హరిత, గోవర్ధన్ నాయుడులు తెలిపారు. నవంబర్ 22వ తేదిన అగ్రహారం ఆసుపత్రికి ఎన్క్యూఎఎస్ కోఆర్డినేటర్ సుబ్రహ్మణ్యం ఆయన సిబ్బంది ఈ ఆసుపత్రినిసందర్శించారన్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో అమలు అవుతున్న వైద్య సదుపాయాలను ప్రజలను అడిగితెలుసుకున్నారని, అలాగే గ్రామంలో రోగాల భారిన పడకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకోవడం ద్వారా ప్రజలకు మనోధైర్యాన్ని కల్పించామన్నారు. మదర్అండ్ చైల్డ్ సర్వీసెస్, వ్యాధి నిరోధక టీకాల సర్వీసెస్, దీర్ఘకాలిక జబ్బులతో బాధపడుతున్న వారికి ఎప్పటికప్పుడు ఉచిత వైద్యాన్ని అందించడం ద్వారా ప్రజల్లో గుర్తింపు తెచ్చుకున్నామన్నారు. కీటక జనిత వ్యాధులు నివారించడం ద్వారా 90శాతం గుర్తింపు వచ్చిందని ఎన్క్యూఎఎస్ ఆర్గనైజర్ సుబ్రహ్మణ్యం తెలిపారాన్నారు. ఈ కార్యక్రమంలో సూపర్‌వైజర్ రామకుమార్, హెల్త్ అసిస్టెంట్ హర్షవర్దన్, లక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పి పావని, ఆశా కార్యకర్తలు రామలక్ష్మి, నారాయణమ్మ, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

# పంచాయితీలకు నిధులు కేటాయించండి

## - సర్పంచుల సంఘం అధ్యక్షులు భూషణ్

తాడిమర్రి, డిసెంబర్ 2 ప్రభాతవార్త



ఆర్థిక మంత్రికి పుష్పగుచ్చం ఇస్తున్న సర్పంచుల సంఘం అధ్యక్షులు భూషణ్

పంచాయితీలకు క్రమం తప్పకుండా నిధులు విడుదల చేయాలని ఉమ్మడి జిల్లాల సర్పంచుల సంఘం అధ్యక్షులుగోనుగుట్ల భూషణ్, ఆర్థిక శాఖమంత్రిపయ్యావుల కేశవ్‌కు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన అనంతపురంలోని ఆయన గృహంలో ఈ సందర్భంగా కలిసి పుష్పగుచ్చం అందజేసి పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకెళ్లారు. ఈ సందర్భంగా మౌలిక సదుపాయాల కోసం సిసి రోడ్ల నిర్మాణానికి డ్రైనేజీలు, వీధి దీపాలు ఏర్పాటు చేయడానికి నిధులు మంజూరు చేయాలని కోరారు. ఎన్‌డిఎ ప్రభుత్వంలో గ్రామాలకు మహర్దశ వస్తుందని ప్రజలంతా ఎదురుచూస్తున్నారన్నారు. తద్వారా గ్రామాల రూపురేఖలు మారుతాయని ఆయన దృష్టికి తెచ్చారు. ప్రతి ఇంటికి జల జీవన్ మిషన్ ద్వారా మంచినీటిని అందిస్తామని పయ్యావుల కేశవ్ హామీ ఇచ్చారు. అనంతరం జిల్లాకు వరప్రసాది అయిన హంద్రీనీవా కాలువను విడుదలచేసి ప్రతి చెరువుకు,గ్రామాల్లోని కుంటలకు నీరందిస్తామని మంత్రి చెప్పారన్నారు. తద్వారా భూ గర్భ జలాలు పెరిగి ప్రతి ఎకరాకునీరు ఇచ్చేందుకు అవకాశం ఉంటుందన్నారు. జిల్లాలో అవసరం ఉన్న ప్రతి రైతుకు డ్రిప్ ఇరిగేషన్ ద్వారా స్ప్రింక్లరు అందజేస్తామని మంత్రి తెలిపారన్నారు. ప్రజా కనీస సౌకర్యాలు,రైతుల అవసరాలను మంత్రికి తెలియజేయడం హర్షయమని ఆయనకు కృతజ్ఞతలు తెలిపారన్నారు.

# అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వానికి రెండు కళ్ళు

## -సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజలో టీడీపీ నాయకులు

ఉరవకొండ, డిసెంబర్ 2 ప్రభాతవార్త



సీసీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న దృశ్యం

అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వానికి రెండు కళ్ళు లాంటివని తెలుగుదేశం పార్టీ పట్టణ అధ్యక్షులు మాదినేని రామాంజినేయులు, మాజీ వైస్ ఎంపిపి పి.రాజేష్, టీడీపీ సీనియర్ నాయకులు ప్యారం కేశవానంద, మేజర్ పంచాయతీ వార్డు సభ్యులు చేజాల ప్రభాకర్, పి.నిరంజన్‌గౌడ్ అన్నారు. పట్టణంలోని 8వ వార్డు రాజప్ప గోదాముకు ముందు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం నిధులు 5 లక్షల రూపాయల వ్యయంతో నూనతంగా చేపట్టిన సిమెంటు రోడ్డు నిర్మాణ పనులను భూమిపూజ చేసి ప్రారంభించారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కె.పవన్‌కళ్యాణ్, ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ రాష్ట్రంలో ప్రజలకు మెరుగైన మౌళిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి సిమెంటు రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు యేళ్ళ తిమ్మప్ప, బాబు, వడ్డే లాలుస్వామి, రమేష్, ఖలంధర్, శంకర సుదర్శన, సుంకన్న, బాలాజీ, అనీల్, రఘు, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

# ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించకండి - జిల్లా ఎస్పీ రత్న

శ్రీ సత్య సాయి జిల్లా ప్రతినిధి, డిసెంబర్ 2 ప్రభాతవార్త



ఫిర్యాదుదారుతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ రత్న

ఫిర్యాదుల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించరాదని జిల్లా ఎస్పీ రత్న పోలీస్ అధికారులను ఆదేశించారు. సోమవారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలోని కాన్ఫరెన్స్ హాల్లో "ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం) కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫిర్యాదుదారుల నుండి అర్జీలను స్వీకరించి, అర్జీదారులతో ఎస్పీ ముఖాముఖి మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబ కలహాలు, సైబర్ మోసాలు, గృహహింస, భూఆస్తి వివాదాలు, ఆన్ లైన్ మోసాలు, ఇతర సమస్యలపై ఫిర్యాదుదారులు ఎస్పీకి విన్నవించుకున్నారు. వారి సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో ఎస్పీ స్వయంగా ఫోన్లో మాట్లాడారు. సత్వర న్యాయం అందించేలా కృషి చేయాలని, బాధితులకు చట్ట పరిధిలో తక్షణ న్యాయం అందించేలా చర్యలు తీసుకుని, అందుకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో మొత్తం 35 ఫిర్యాదులు అందాయి. ఈ కార్యక్రమంలో ఎస్పీతో పాటు అడిషనల్ ఎస్పీ ఆర్ల శ్రీనివాసులు, లీగల్ అడ్వైజర్ సాయినాథ్ రెడ్డి , డి.సి.ఆర్.బి సి.ఐ శ్రీనివాసులు, సిబ్బంది పాల్గొన్నారు.

# 4 న 17వ విడత సామాజిక తనిఖీ నిర్వహణ ప్రజా వేదిక..

చెన్నేకొత్తపల్లి, డిసెంబర్, 02 ప్రభాతవార్త

మహాత్మా గాంధీ గ్రామీణ జాతీయ ఉపాధి హామీ పథకం, 17వ విడత సామాజిక తనిఖీ నిర్వహణ బహిరంగ ప్రజా వేదిక నాల్గవ తేదీ న మండల కేంద్రమైన చెన్నై కొత్తపల్లి, మండల పరిషత్ కార్యాలయం ఆవరణ యందు, నిర్వహిస్తున్నట్లు మండల అధికారి ఎంపీడీవో తెలియజేశారు,,మహాత్మా గాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం, చెన్నై కొత్తపల్లి మండలంలోని 15 గ్రామపంచాయతీలో,2023 2024, పనులు సంబంధించి, 17 విడత సామాజికత్వానికీలు నిర్వహించడం జరిగిందని, అలాగే ఆయా పంచాయతీల్లో గ్రామసభలు కూడా నిర్వహించడం జరిగిందని అన్నారు, కావున ఆయా పంచాయతీలలో, వెల్లడైన సామాజిక తనిఖీ ఫలితాలను, చర్చించేందుకు, చిన్న కొత్తపల్లి మండల పరిషత్ కార్యాలయం నందు నాలుగో తేదీ ఉదయం 10 గంటలకు, బహిరంగ ప్రజావేదిక నిర్వహించడం జరుగుతుందని, కావున ప్రజాప్రతినిధులు, ఉపాధి హామీ పనులకు సంబంధించిన, ఫీల్ అసిస్టెంట్లు, సీనియర్ మెట్లు, గతంలో పనిచేసిన ఫీల్డ్ అసిస్టెంట్, పంచాయతీ కార్యదర్శులు, ప్రతి ఒక్కరూ హాజరుకావాలని, ఎంపీడీవో, తెలియజేశారు,

# అయ్యప్ప స్వాములతో కలిసి భిక్షను స్వీకరించిన వానరం

మడకశిర డిసెంబర్ 02 ప్రభాతవార్త



అయ్యప్ప స్వాములతో కలసి భిక్షను స్వీకరిస్తున్న వానరం

మడకశిర పట్టణ పరిధిలోని వద్రపాళ్యం లో వెలసిన శ్రీరామ దేవాలయంలో గురుస్వామి కరియన్నా స్వామి క్యాటరింగ్ హనుమంతు స్వాములు మరియు భక్తుల సహకారంతో అయ్యప్ప స్వాములకు అన్నదానం ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం మధ్యాహ్నం అయ్యప్ప స్వాములకు అన్నదానం ఏర్పాటు చేశారు. క్యాటరింగ్ హనుమంతు గురుస్వామి కరియన్న స్వాములు భిక్షను స్వీకరిస్తున్న సమయంలో వానరుడు విచ్చేసి వారితో కలిసి భుజించడం, చూపరులను గ్రామ ప్రజలను ఒకింత ఆశ్చర్యానికి గురిచేసింది. శ్రీరామ మందిరంలో ఇలాంటి సంఘటన జరగడం శుభసూచకమని చాలా సంతోశించదగ్గ విషయమని గ్రామ ప్రజలు తమ హర్షాన్ని వ్యక్తం చేశారు.

# కనకదాసు విగ్రహ ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించండి

రామగిరి, డిసెంబర్ 2 ప్రభాతవార్త



పరిటాలసునీతకు వినతిపత్రం అందజేస్తున్న కురుబ కులస్థులు

మండలంలోని పేరూరు గ్రామంలో కనకదాసు విగ్రహ ఏర్పాటుకు స్థలాన్ని కేటాయించాలని పేరూరు గ్రామానికి చెందిన కురుబ కులస్తులు రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతకు విజ్ఞప్తి చేశారు. సోమవారం వారు వెంకటాపురంలో పరిటాలసునీతనుకలిసి పేరూరులో ఏదైనా కూడలి ప్రాంతంలో కనకదాసు విగ్రహాన్ని ఏర్పాటు చేసుకునేందుకు అనుమతులు మంజూరు చేయాలనికోరారు. అదే విధంగా విగ్రహ ఏర్పాటుకు కూడా సహకరించాలన్నారు. మీ అభ్యర్థన మేరకు స్థలాన్ని కేటాయించి సహకరిస్తానని ఆమె హామీ ఇచ్చారు.

# అయ్యప్ప స్వామి దేవాలయానికి స్థలం కేటాయించండి

పుట్టపర్తి టౌన్ డిసెంబర్ 2 ప్రభాతవార్త



కలెక్టర్కు వింత పత్రం అందజేస్తున్న భక్తులు

పుట్టపర్తి పట్టణంలో అయ్యప్ప స్వామి దేవాలయానికి స్థలం కేటాయించాలని అయ్యప్ప భక్తులు కోరారు. సోమవారం ప్రజా సమస్యల ఫిర్యాదు వేదికలో అయ్యప్ప భక్తులు కలెక్టర్కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అయ్యప్ప స్వామి దేవాలయానికి స్థలం కేటాయించాలని పుట్టపర్తి ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డిని కోరగా ఎనుములపల్లి పొలంలో సర్వే నంబర్ 9 లో చదును చేసుకోవాలని చెప్పడం జరిగిందన్నారు. ఈ స్థలంలో చదును చేస్తుండగా రెవెన్యూ అధికారులు వచ్చి పనులు నిలిపివేశారన్నారు. పట్టణంలో దాదాపు 560 మంది అయ్యప్ప స్వామి భక్తులు ఉన్నామని ఇదివరకు పట్టణంలోని ఆంజనేయస్వామి దేవాలయంలో పూజలు నిర్వహించేవారమన్నారు. ఆంజనేయ స్వామి గుడి మరమ్మతులు జరుగుతుండగా అక్కడ ఉండటానికి ఇబ్బందిగా ఉందని బయటకి రావడం జరిగిందన్నారు. ఇప్పుడు పూజలు నిర్వహించుకోవడానికి ఎక్కడ స్థలం లేక ఇబ్బందులు పడుతున్నామని కలెక్టర్ దృష్టికి తెచ్చారు. అయ్యప్ప దేవాలయ నిర్మాణానికి స్థలం కేటాయించాలని విన్నవించారు.

# ప్రజా దర్బార్‌కు విశేష స్పందన

## ప్రజల నుంచి వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే

గుడిబండ డిసెంబర్ 2 ప్రభాతవార్త:



ప్రజల నుంచి వినతులు స్వీకరిస్తున్న దృశ్యం

గుడిబండ మండల కేంద్రంలో మడకశిర ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పే స్వామి నిర్వహించిన ప్రజా దర్బార్ కు మండల ప్రజల నుండి విశేష స్పందన లభించింది. ఈ సందర్భంగా ప్రజలు తమ సమస్యలను అర్జీల రూపంలో ఎమ్మెల్యే ఎంఎస్ రాజుకు వినతి పత్రాలు అందించారు. బియ్యంకార్డులు, ఇళ్ళు, భూములకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ప్రజలు పెద్ద ఎత్తున వినతి పత్రాలు అందించారు. ఇందులో ముఖ్యంగా భూ సమస్యలకు సంబంధించి ఎక్కువ వినతి పత్రాలు రావడం విశేషం. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి డాక్టర్ శ్రీనివాసమూర్తి, తహాశీల్దారు కరుణాకర్, ఎంపిడిఓ గంగాధర్, ఆర్ఐ మహ్మద్ బిలాల్, మండల అధ్యక్షుడు మద్దనకుంటప్ప, ప్రధాన కార్యదర్శి ప్రకాష్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మంజునాథ్, దుర్గేష్, ఎంపిటిసి వనజాశశిధర్, లాయర్ శివకుమార్, లక్ష్మినరసప్ప, భీమరాజు, మాజీ ఎంపిటిసిలు భోజరాజు, వెంకటేష్, నజీర్, పురుషోత్తం, బాదిపల్లెప్ప, షబ్బీర్ తదితర తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు ప్రజలు పాల్గొన్నారు.

# కోర్టు ఉత్తర్వులను ధిక్కరిస్తే వ్యక్తిగత కంటెంట్‌కు వెళ్తాం -సిఐటియు

పుట్టపర్తి టౌన్ డిసెంబర్ 2 ప్రభాతవార్త

విఓఏ ల విధులకు ఆటంకాలు, తొలగింపులకు గురి చేస్తున్న సీసీ ల పై చర్యలు తీసుకొని విఓఏ ల విధులకు రక్షణ కల్పించి న్యాయం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈ ఎస్ వెంకటేష్ డిమాండ్ చేశారు. పుట్టపర్తి ఏసి క్లస్టర్ పద్మావతి కి కొత్తచెరువు ఏపీఎం నారాయణ కి సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం అర్జీలను అందజేశారు. ఎస్సీ ,ఎస్టీ, బీసీ, ఓసి,మైనార్టీ వర్గానికి చెందిన 10 నుండి 18 సంవత్సరాలుగా విఓఏలుగా పని చేస్తున్న సీసీ లు ప్రస్తుతం విఓఏ గా విధులు నుండి తప్పుకోవాలని మా విధుల నిర్వహణకు అడ్డు పడుతూ వేధింపులకు గురి చేస్తున్నారనీ మాకు మరింత భయం కలిగే విధంగా విఓఏ ల పేర్లను ప్రభుత్వ వెబ్ సైట్ నుండి తొలగించి, గ్రామైక్య సంఘాల గ్రూపుల నందు బలవంతంగా వివిఓ గా తొలగింపుకు తీర్మానాలు చేయించేందుకు దగ్గరుండి కొంత మంది సీసీలు సహకారం అందిస్తున్నారు. అధికార పార్టీ నాయకులకు సీసీలు పరోక్షంగా పనిచేస్త విధులకు మమ్మలను దూరం చేస్తూ సంఘాల మినిట్స్ రిజిస్టర్ లు ఇవ్వాలని వేధింపులకు గురిచేస్తున్నారన్నారు. సంఘాల ఆర్థిక లావా దేవీలకు ( పొదుపు , అప్పులు చెల్లింపులు ) సీసీ లు బ్యాంక్ అధికారులకు ఫోన్ చేసి వీరిని తొలగించామని సహకరించవద్దని మాట పూర్వకంగా తెలపడం బాధాకరమన్నారు. కావున మాకు న్యాయం చేయాలని, గౌరవ హైకోర్టు ఉత్తర్వులు సర్ఫ్ సిఓ ఇచ్చిన సర్కులర్ మరియు జిల్లా పిడి అధికారి ఇచ్చిన సర్కులర్లను ఆమె కు సమర్పించారు. వీటిని ఇక మించి మమ్మల్ని ఇబ్బందులకు గురి చేస్తే మేము వ్యక్తిగతంగా కంటెంట్ కు వెళ్లడానికి సిద్ధమన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటియ నాయకులు అంజి విఓఏ జిల్లా కోకన్వీనర్ వెంకట్రాముడు, సుజాత, రామాంజనమ్మ ,ప్రసాదు, జయరాం తదితరులు పాల్గొన్నారు.

# 104 వాహన కార్మికుల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి - సిఐటియు నేతలు

ధర్మవరం, డిసెంబర్ 2 ప్రభాతవార్త




మాట్లాడుతున్న సిఐటియు నేతలు

రాష్ట్ర వ్యాప్తంగా 104 వాహనాల్లో పనిచేస్తున్న డ్రైవర్లు, కార్మికుల సమస్యలు పరిష్కరించాలని చాలా కాలంగా నిరసన తెలువుతున్నప్పటికీ ప్రభుత్వాలు స్పందించడం లేదని వెంటనే స్పందించివారి సమస్యలు పరిష్కరించాలని సిఐటియు నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక సిపిఎం పార్టీ కార్యాలయంలో సిఐటియు నాయకులు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు మండల కన్వీనర్ జెవి.రమణ ఏపిరైతు సంఘం జిల్లా అధ్యక్షులు జంగాలపల్లి పెద్దన్న, సిఐటియు మండల కో కన్వీనర్ ఆయుబ్‌ఖాన్, సిఐటియు నాయకులు జంగన్న మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా 104 ఉద్యోగులు దాదాపుగా నెలరోజులుగా నిరసనకార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. గత 16 సంవత్సరాలుగా 103 కార్మికులు ప్రజలకు నిరంతరం సేవలందిస్తూ అనారోగ్య కారణాల వలన ప్రజలు ఇబ్బందులకు గురైనప్పుడు వారికి పగలు రాత్రి అనే తేడా లేకుండా వారు ప్రజలకు సేవలు అందిస్తున్నారన్నారు. దివంగత ముఖ్యమంత్రి రాజశేఖర్‌రెడ్డి ఉన్నప్పటి నుంచి వారు ప్రజలకు సేవలు అందిస్తున్నారు. కానీ వైఎస్.జగన్ ముఖ్యమంత్రి అయిన తర్వాత వారిని అరవిందో యాజమాన్య సంస్థకు అప్పగించడం జరిగింది. అప్పటి నుంచి వారి సమస్యలను ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేక 104 డ్రైవర్లు నిరంతరం అనేక రకాల ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ప్రధానంగా కార్మికులకు కనీస వేతనం అమలు చేయాలని, వారిని రెగ్యులర్ చేయాలని, ప్రతి నెల వేతనాలు ఇవ్వాలని, వాహనాల రిపేర్లు ప్రభుత్వము చేయించాలని, డిఈఓ డ్రైవర్ల సెల్లులకు అడ్వాన్స్‌గా ఆరు నెలల రీచర్జ్ చేయించాలని అనేక రకాలసమస్యలు పరిష్కరించాలని వారు ఈ సందర్భంగా ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# నైపుణ్య అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో సిసిటివి ఇన్‌స్టలేషన్ మరియు సాఫ్ట్ స్కిల్స్ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

బుక్కపట్నం డిసెంబర్ 2 ప్రభాతవార్త

రైటర్ ఫోటో తీర్పీ ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ సీడ్ యాప్ సంయుక్తంగా CCTV Installation మరియు సాఫ్ట్ స్కిల్స్ కోర్సులు ప్రారంభిస్తున్నట్లు శ్రీశ్రీ గవర్నమెంట్ డిగ్రీ కళాశాల బుక్కపట్నం స్కిల్ హబ్ లో ప్రారంభిస్తున్నట్లు ప్రిన్సిపల్ డాక్టర్ మక్బుల్ హుస్సేన్ మరియు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ అధికారి హరి కృష్ణ ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు. ।గి। ఇంటర్ ,డిగ్రీ ,పాస్ లేదా ఫెయిల్ ఆ పైన చదివిన వారు ఈ కోర్సులను నేర్చుకోవడానికి అర్హులు. ఆసక్తి ఉన్న యువతి యువకులు తమ ఆధార్ లింక్ కలిగినా మొబైల్ నెంబర్ కలిగి ఉండాలి. కోర్సు వేవధి 3 నెలలు ఉంటుందని శిక్షణ అనంతరం ఉద్యోగ అవకాశాలు కూడా కలగజేస్తామన్నారు. ఆసక్తి కలవారు స్కిల్ హబ్ కో ఆర్డినేటర్ ను 7981541994సంప్రదించాలని కోరారు.

# నెలరోజుల నుంచి అడంగల్‌రాక రైతన్నలు ఇబ్బందులు

అగళి, డిసెంబర్ 2 ప్రభాతవార్త

రైతుల పాస్‌పుస్తకాల కోసం దరఖాస్తు చేసుకోవాలన్నా మీ సేవలో మ్యూటేషన్ చేయించాలన్నా తప్పనిసరిగా అడంగల్, 1బి తదితర రికార్డులు ఉండాలి. నెల రోజుల నుంచి మీ సేవలో, సచివాలయాల్లో రైతులు అడంగల్ కోసం వెళితే.. ప్రింట్ రావడం లేదని సంబంధిత ఉద్యోగులుచెబుతున్నారు. దీనికి కారణాలు అన్వేషిస్తే సాంకేతిక సమస్య వల్ల రైతన్నలకు అడంగల్ రావడం లేదని, ఫలితంగా సదరు రైతులు పాస్‌పుస్తకాలను తీసుకోలేని పరిస్థితి. అందుకే సంబంధిత విషయాలపై తహాశీల్దారు సుబ్బారావును వవరణ కోరగారాష్ట్ర వ్యాప్తంగా ఈ సమస్య ఉందని సాంకేతిక సమస్యను పరిష్కరించిన వెంటనే రైతుల సమస్యలను ఎక్కడికక్కడ, ఎప్పటికప్పుడు పరిష్కారం చేస్తామని ఆర్ఐ చంద్రశేఖర్‌రావు, తహాశీల్దారు సుబ్బారావు తెలిపారు.

# అధైర్య పడొద్దు ప్రభుత్వం అండగా ఉంటుంది

## -సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీలో టీడీపీ నేత పయ్యావుల శ్రీనివాసులు

ఉరవకొండ, డిసెంబర్ 2 ప్రభాతవార్త



వృద్ధురాలు కురువ పెద్ద వన్నక్కకు సీఎంఆర్ఎఫ్ చెక్కు అందిస్తున్న టీడీపీ సీనియర్ నేత పయ్యావుల శ్రీనివాసులు

అధైర్య పడొద్దని ప్రభుత్వం అన్ని వేళలా అండగా ఉంటుందని టీడీపీ సీనియర్ నేత పయ్యావుల శ్రీనివాసులు భరోసా ఇచ్చారు. సోమవారం జిల్లా కేంద్రం అనంతపురంలో రాష్ట్ర ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ స్వగృహంలో జరిగిన కార్యక్రమంలో వజ్రకరూరు మండలం చాబాల గ్రామానికి చెందిన కురువ పెద్ద వన్నక్క అనే వృద్ధురాలికి ముఖ్యమంత్రి సహాయనిధి కింద మంజూరైన 1,14,882 రూపాయల చెక్కును టీడీపీ సీనియర్ నేత పయ్యావుల శ్రీనివాసులు అందజేశారు. ఈ కార్యక్రమంలో చాబాల మాజీ సర్పంచ్ సి.ఎర్రిస్వామి, తెలుగు యువత అధ్యక్షులు చల్లా అనంత, గ్రామ కమిటీ అధ్యక్షులు జె.లింగమూర్తి, నాయకులు కురువ గోపాల్, కురువ మహేష్, కురువ వన్నూరు, కురువ సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# రేపటి నుంచి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి షష్ఠి ఉత్సవాలు

## -సర్వాంగ సుందరంగా ముస్తాబవుతున్న ఆలయం

## -7న షష్ఠి సోమవారం స్వామివారి కళ్యాణోత్సవం

## -8న వసంతోత్సవంలో ముగియనున్న ఉత్సవాలు

ఉరవకొండ, డిసెంబర్ 2 ప్రభాతవార్త



ప్రత్యేకాలంకరణలో సుబ్రహ్మణ్యేశ్వరస్వామి మూలవిరాట్ దృశ్యం

ఉరవకొండ పట్టణంలోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయంలో ఈనెల 4వ తేదీ స్వస్తిశ్రీ క్రోదినామ సంవత్సరం మార్గశిర తదియ నుంచి స్వామివారి షష్ఠి ఉత్సవాలు ప్రారంభం కానున్నాయి. 5 రోజులపాటు జరిగే ఉత్సవాలకు ఆలయాన్ని సర్వాంగ సుందరంగా ముస్తాబైంది. ఆలయ కార్యనిర్వహణ అధికారి ఎ.క్రిష్ణయ్య, అర్చకులు వి.పి.దివాకర శర్మ, వి.పి.నాగరాజు శర్మ, కార్యకర్తలు కె.రామారావు, పి.శివకుమార శర్మ, కె.కె.ప్రసాద్ తెలిపిన మేరకు వివరాల్లోకి వెళితే...4న బుధవారం తదియ గురుప్రార్థన, సుప్రభాతసేవ, గణపతిపూజ, పుణ్యావాచనం, నాంది పంచగవ్యప్రాశనము, రక్షాబంధనం, కలశస్థాపన, స్వామివారికి పంచఫలములతో, 11 కేజీల తేనేతో విశేష అభిషేకం, సాయంత్రం ధ్వజారోణ కార్యక్రమాలు జరుగనున్నాయి. 5న గురువారం చవితి ఉదయం సుబ్రహ్మణ్యేశ్వరస్వామి వారికి అష్టోత్తర శత (108) పచ్చి టెంకాయల జలముతో అభిషేకము, గణపతి, సుదర్శన, లక్ష్మీనారాయణ హోమాలు, సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాలు, సాయంత్రం నవనాగ పూజ, కుంకుమార్చన జరుగుతాయి. 6న పంచమి శుక్రవారం 108 లీటర్ల పాలతో శత రుద్రాభిషేకం, నవగ్రహ పరస్పర రుద్ర స్వహాకారము, సాయంత్రం లగ్నపత్రిక, నాగమండలారాధన, కుంకుమార్చన కార్యక్రమాలు జరుగనున్నాయి. 7న షష్ఠి శనివారం స్వామివారి మూలవిరాట్‌కు విశేష అలంకారము, సుబ్రమణ్య గాయత్రీ హవనము, అభిజిత్ లగ్నంలో శ్రీస్వామివారి కళ్యాణోత్సవం, సాయంత్రం గ్రామోత్సవం, డోలనోత్సవం కార్యక్రమాలు జరుగనున్నాయి. 8న సప్తమి ఆదివారం స్వామివారికి అభిషేకం, కలశ ఉద్వాసన వసంతోత్సవం, ధ్వజ అవరోహణ కార్యక్రమాలతో ఉత్సవాలు ముగియనున్నాయి. ఉత్సవాల సందర్భంగా 4వ తేదీ నుండి 6 వరకు ప్రతిరోజూ సాయంకాలం సామూహిక కుంకుమార్చన, కాలసర్ప దోషశాంతి, రాహు, కేతు, కుజగ్రహముల దోషము కలవారికి శాంతి కార్యక్రమాలు, కాత్యాయనీ వ్రతం జరుగనుంది.

# కొండ గుట్టల ప్రాంతంలో ఇచ్చిన ఇంటిస్థలాలను మార్చండి

## -తహశీల్దార్‌కు విన్నవించిన 32 మంది బసివినులు

ఉరవకొండ, డిసెంబర్ 2 ప్రభాతవార్త



విలేఖరులతో మాట్లాడుతున్న హావళిగి గ్రామానికి చెందిన బసివినులు



వారికి 2012లో మంజూరు చేసిన ఇంటిస్థలం పట్టా

మండల పరిధి లోని చిన్నము ష్టూరు గ్రామంలోని కొండ గుట్టల ప్రాంతం లో ఇంటి స్థలాలు ఇచ్చారని అక్కడ ఇప్పటివరకు ఇళ్లను నిర్మించుకోలేదని తమకు మరొకచోట పట్టాలివ్వాలని బసివినులు తహశీల్దార్ ఎస్.మహబూబ్‌బాషాకు విన్నవించారు. సోమవారం మండల తహశీల్దార్ కార్యాలయంలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఈమేరకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా బసివినులు పక్కీరమ్మ, హనుమక్క, ఉలిగమ్మ, కొల్లమ్మ, నాగమ్మ తదితరులు మాట్లాడుతూ విడపనకల్లు మండలం హావళిగి గ్రామానికి చెందిన 32 మంది బసివినులైన తమకు 2012లో ప్రభుత్వం చిన్నముష్టూరు గ్రామంలో సర్వే నంబర్ 175-1లో ఒక్కొక్కరికి 1.5 సెంట్ల చొప్పున నివేశిత స్థలం మంజూరుచేసి పట్టాలిచ్చిందన్నారు. అయితే ఆస్థలం ఇంటి నిర్మాణాలకు అనువుగా లేకపోవడంతో ఇప్పటివరకు ఒక్కరం కూడా ఇళ్లను నిర్మించుకోలేదని వాటి స్థానంలో తమకు పట్టణంలో ఇంటి నిర్మాణాలకు అనువైనచోట స్థలాలు కేటాయించాలని కోరారు.

# ఆసుపత్రికి వెళ్లి పింఛన్లు పంపిణీ చేసిన వెల్ఫేర్ అసిస్టెంట్

బుక్కపట్నం, డిసెంబర్ 2, ప్రభాతవార్త



ఫించన్లు పంపిణీ చేస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్ భూషన్‌కుమార్

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రతిఇంటికి తలుపు తట్టిపెంచిన పింఛన్ను వెంటనే అందజేయాలని సదుద్దేశంతో సాక్షాత్తు ముఖ్యమంత్రి రాష్ట్రంలో పల్లెపల్లెన తానే స్వయంగా పేదవాని గడప గడపకు వెళ్లి స్వయాన ఆయన చేతుల మీదే లబ్ధిదారులకు పింఛను అందజేసి అవ్వ తాతలకు వికలాంగులకు సకాలంలో పింఛన్ అందించి వారి హృదయాలలో తను పెద్ద కొడుకుగా కష్టసుఖాలలో ఉన్ననేపథ్యంలో ఆయన స్ఫూర్తితో సత్యసాయి జిల్లా బుక్కపట్నం ఎంపీడీవో గారి పరిధిలో ఉన్న సచివాలయంలో ఉన్న వెల్ఫేర్ అసిస్టెంట్ ఎస్.భూషణ్ కుమార్ ఈరోజు ఐదు మంది లబ్ధిదారులకు తన సొంత ఖర్చులతో పింఛన్లు పంపిణీచేశాడు. ఇబ్రహీంభాష అనారోగ్యంవల్ల బత్తలపల్లిలో చికిత్స పొందుతున్నాడు ఆయనకు మరియు గూని పల్లి నివాసి అనారోగ్యసమస్య వల్ల అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రి నందు చికిత్సలో ఉండడం వల్ల ఆమెకు కూడా అక్కడికే వెళ్లిఅందజేయడం అనంతపురం నగరంలో ఇద్దరికీ మరియు పుట్టపర్తి లో ఉన్న ఒకరికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గారికి, జిల్లా కలెక్టర్ గారికి ,మండల ఎంపీడీవో మరియు వెల్ఫేర్ అసిస్టెంట్ గారికి మనస్ఫూర్తిగా ధన్యవాదాలు తెలపడం జరిగింది.

## 5,6 తేదీల్లో దుర్గాభవాని ఆలయ 7వ వార్షికోత్సవం

### -6న చండీ హోమం, కుంభాభిషేకం, పూజలు

ఉరవకొండ, డిసెంబర్ 2 ప్రభాతవార్త



ఉరవకొండ పట్టణంలోని స్థానిక వైకేపీ కార్యాలయం వద్దగల దుర్గాభవాని అమ్మవారి ఆలయ 7వ వార్షికోత్సవ వేడుకలు ఈనెల 5,6 తేదీల్లో జరుగుతాయని ఆలయ కమిటీ తెలిపింది. స్వస్తిశ్రీ క్రోదినామ సంవత్సరం మార్గశిర చవితి 5వ తేదీ చవితి గురువారం సాయంత్రం గణపతిపూజ, పుణ్యాహవాచనము, కళశస్థాపన గణపతి, నవగ్రహ, రుద్రహోమాలు జరుగుతాయన్నారు. 6వ తేదీన పంచమి శుక్రవారం సూర్యోదయ పూర్వము అమ్మవారికి సుప్రభాత సేవ, పంచామృత అభిషేకం, విశేష ద్రవ్యములతో అభిషేకం, గణపతి సుబ్రమణ్య పూజ, మల్లేశ్వరస్వామి వార్లకు రుద్రాభిషేకం, చండీహోమం, అర్చన, అమ్మవారి మూలవిరాట్‌కు విశేష అలంకారం, పూర్ణాహుతి, అమ్మవారికి కుంభాభిషేకం మహా మంగళహారతి కార్యక్రమాలు, మధ్యాన్నం అన్నదానం, సాయంత్రం 4.45 గంటల నుండి గ్రామోత్సవం నిర్వహించడం జరుగుతుందన్నారు. పూజా కార్యక్రమాలు వేద పండితులు ఫణిస్వామి బృందం ఆధ్వర్యంలో జరుగుతాయని భక్తులు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు.

## కమ్ముకున్న ముసురు.. కురుస్తున్న తేలికపాటి వర్షం

ఉరవకొండ, డిసెంబర్ 2 ప్రభాతవార్త

బంగాళాఖాతంలో ఏర్పడిన ఫెయింజల్ తుఫాను తీరం దాటిక క్రమంలో దాని ప్రభావంతో ఉరవకొండ ప్రాంతంలో సోమవారం ఉదయం నుండి తేలికపాటి వర్షం కురుస్తూనే ఉంది. ముసురు కమ్ముకొని ఏకధాటిగా వర్షం కురుస్తుండటంతో జనజీవనానికి ఇబ్బందులు కలుగుతున్నాయి. ముసురు కమ్ముకున్న క్రమంలో పగటి ఉష్ణోగ్రత గణనీయంగా పడిపోయి చలి తీవ్రత కూడా పెరిగింది. తేలికపాటి వర్షం కురుస్తున్న క్రమంలో రెక్కాడితేగాని డొక్కాడని కూలీలు, చిరువ్యాపారులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. ఈ పరిస్థితి మరో రెండు రోజులు కొనసాగే అవకాశాలు ఉన్నాయని వాతావరణశాఖ చెప్పినట్లు సమాచారం.

## గ్రామాల్లో సమస్యలపై పరిటాల సునీత ఆరా

రామగిరి, డిసెంబర్ 2 ప్రభాతవార్త



రాప్తాడు మండల ప్రజలతో మాట్లాడుతున్న పరిటాల సునీత

నియోజకవర్గంలోని పలు గ్రామాల నుంచి వచ్చిన నియోజకవర్గ ప్రజలతో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీతసోమవారం చర్చించారు. వెంకటాపురంకు వచ్చిన వారందరిని పిలిచిగ్రామాలలో మౌలిక వసతులపై ఆరాతీశారు. గ్రామాల్లో మంజూరైన సిసిరోడ్ల పనులు పూర్తి అయ్యాయని విచారించారు. అదే విధంగా నసనకోట ఎంబిజి పాఠశాల ప్రిన్సిపల్ హమీనాబేగం, రామగిరిలోని మోడల్ స్కూల్ ప్రిన్సిపల్ రామేశ్వరిలు వేరువేరుగా కలిసి ఈ నెల 7వ తేదిన జరిగే తల్లిదండ్రుల సమావేశానికి హాజరు కావాలన్నారు.

## 8వ తేదిన ఉచిత కంటి ఆపరేషన్ల వైద్య శిభిరం

ధర్మవరం రూరల్, డిసెంబర్ 2 ప్రభాతవార్త



కరపత్రాలను విడుదల చేస్తున్న దృశ్యం

పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో (వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ ఎదురుగా) ఈ నెల 8వ తేదీ ఆదివారం ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉచిత కంటి ఆపరేషన్ల వైద్య శిభిరమును నిర్వహిస్తున్నట్లు రోటరీ క్లబ్ అధ్యక్షులు బి.జయసింహా, కార్యదర్శి డి.నాగభూషణ, కోశాధికారి వై.సుదర్శన్ గుప్తా, క్యాంపుచైర్మన్ జి.పెరుమాళ్లదాస్ తెలిపారు. ఈ సందర్భంగా పట్టణంలోని సాంస్కృతిక మండలిలో శిభిరం యొక్క కరపత్రాలను క్లబ్ కమిటీతోపాటు అందరూ విడుదల చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ఈ ఉచిత కంటి ఆపరేషన్ల వైద్య శిభిరం రోటరీ క్లబ్, శంకర కంటి ఆసుపత్రి-బెంగళూరు, జిల్లా అంధత్వ నివారణసంస్థ-అనంతపురం జిల్లా వారి సహకారంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ క్యాంపునకు దాతలుగా కీర్తిశేషులు దాసరి కేశమ్మ, కీర్తి శేషులు దాసరి పెద్ద వెంకటేశ్వర్లు, జ్ఞాపకార్థం వారి కోడలు, కుమారుడు దాసరి రమాదేవి, డివి.వెంకటేషులు(చిట్టి) వారి కుటుంబ సభ్యులు వ్యవహించడం జరిగిందన్నారు. కంటి నిపుణుల సలహాలతో కళ్లలలో ఉచిత లెన్స్ కూడా అమర్చబడునని తెలిపారు. కంటి వైద్యచికిత్సలు తర్వాత, ఆపరేషన్‌కు ఎంపికన వారికి ఉచిత రవాణా,ఉచిత వసతి, ఉచితంగాఅద్దాలు పంపిణీ చేయబడునని తెలిపారు.కంటి పరీక్షలు చేసుకునే వారు ఆధార్‌కార్డు లేదా రేషన్‌కార్డు లేదా ఓటర్ గుర్తింపు కార్డుల జిరాక్స్‌లు మూడు ఫోటోలు, సెల్ నెంబర్‌తో కూడిన చిరునామా ఇవ్వవలసి ఉంటుందని తెలిపారు. కావున ఈ అవకాశాన్ని పట్టణ,గ్రామీణ ప్రాంతాలలో గల పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

## భౌగోళిక అంశాలపై జరిగిన వర్క్‌షాప్‌లో పాల్గొన్న వజ్రకరూరు సర్పంచ్ మోనాలిసా

### -టెక్నాలజీను వినియోగించుకొని గ్రామాల అభివృద్ధికి ఎంతో ఉపయోగమని వెల్లడి

ఉరవకొండ, డిసెంబర్ 2 ప్రభాతవార్త



వర్క్‌షాపుకు హాజరైన వజ్రకరూరు, పసలూరు పంచాయతీల సర్పంచులు మోనాలిసా, కల్పన, ఎఫ్ఈఎస్ అధికారిణి హేమలత

కేంద్ర ప్రభుత్వం పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జియోస్మార్ట్ ఇండియా పేరుతో పవరింగ్ డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ త్రూ జియోస్పాటికల్ నాలెడ్జ్ అనే అంశంపై హైదరాబాద్‌లోని నోవాటెల్ హోటల్‌లో సోమవారం నిర్వహించిన వర్క్‌షాప్‌లో వజ్రకరూరు మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ మోనాలిసా పాల్గొన్నారు. వర్క్‌షాప్ 2వ తేదీ నుండి 5 వరకు జరుగనుండగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుండి ఇద్దరు సర్పంచులను ఎంపిక చేశారు. ఇందులో ఒకరు ఉరవకొండ నియోజవర్గంలోని వజ్రకరూరు మేజర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ మోనాలిసా, మరొకరు శింగనమల నియోజకవర్గంలోని పసులూరు పంచాయతీ సర్పంచ్ కల్పన. వీరు భౌగోళిక అంశాల ఎఫ్ఈఎస్ అధికారిణి హేమలత పర్యవేక్షణలో వర్క్‌షాప్‌కు హాజరయ్యారు. ఈ సందర్భంగా సర్పంచులు మోసాలిసా, కల్పన మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో చేపట్టే అభివృద్ధి కార్యక్రమాల్లో సాంకేతికతను ఏవిధంగా ఉపయోగించుకోవాలన్న విషయమై హాజరైన అనుభవజ్ఞులైన వక్తలు సవివరంగా తెలియజేశారన్నారు. వర్క్‌షాప్‌లో తెలుసుకున్న విషయాలను గ్రామాల్లో అమలు చేసి ప్రజలకు మరింత ప్రయోజనం చేకూర్చడానికి కృషి చేస్తామన్నారు.

## ఎరువుల దుకాణాలను తనిఖీ చేసిన మండల వ్యవసాయాధికారి

### -రూ.1,36,401 విలువైన ఎరువుల అమ్మకాలు నిలిపివేత

ఉరవకొండ, డిసెంబర్ 2 ప్రభాతవార్త



పట్టణంలోని జువారి ఫామ్ హబ్ లిమిటెడ్ దుకాణంలో ఎరువుల నిల్వలను పరిశీలిస్తున్న మండల వ్యవసాయాధికారి జి.శుభకర్

ఉరవకొండ పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను సోమవారం మండల వ్యవసాయాధికారి జి.శుభకర్ తనిఖీ చేశారు. స్థానిక జువారి ఫామ్ హబ్ లిమిటెడ్ దుకాణంలో నిర్వహించిన తనిఖీల్లో అనుమతిలేని, సరైన పత్రాలు చూపని 1,36,401 రూపాయలు విలువైన ఎరువుల నిల్వల అమ్మకాలను నిలిపివేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఏవో జి.శుభకర్ మాట్లాడుతూ దుకాణాల్లో అనుమతి పత్రాలు లేకుండా ఎరువులు, పురుగుల మందుల విక్రయాలు జరుపరాదని నిబంధనలకు విరుద్ధంగా నడుచుకుంటే దుకాణ యజమానులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సి వస్తుందని హెచ్చరించారు. మండల వ్యాప్తంగా రబీ పంట కాలంలో పప్పుశెనగ, జొన్న తదితర పంటలు వేసిన రైతులు ఫసల్ బీమా యోజన కింద డిసెంబర్ 15వ తేదీలోపు నిర్దేశించిన ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించాలన్నారు. వాతావరణ ఆధారిత బీమా కింద టమోటా, మామిడి పంటలకు బీమా ప్రీమియం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఏవైనా సందేహాలు ఉంటే రైతు సేవా కేంద్రాల్లో సిబ్బందిని సంప్రదించి నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ కైలాష్ పాల్గొన్నారు.

## హెచ్ఐవీ బాధితులకు పౌష్టికాహారం సరుకుల పంపిణీ

ఉరవకొండ, డిసెంబర్ 2 ప్రభాతవార్త

హెచ్ఐవీ బాధితులకు ఉరవకొండ లయన్స్‌క్లబ్ పౌష్టికాహారం సరుకులను పంపిణీ చేసింది. ప్రపంచ ఎయిడ్స్ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని లయన్స్‌క్లబ్ స్టడీ, యోగ కేంద్రంలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో క్లబ్ సభ్యులైన దాతలు చిట్టా శ్రీధర్, ఎం.సి.నాగభూషణ, సి.నాగేశ్వరరావు, ఎం.సోమశేఖర్, కె.సాయి సహకారంతో వారికి సరులకు పంపిణీ చేసిన సంఘం ప్రతినిధులు వారి క్షేమ సమాచారాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ అధ్యక్షులు ఎం.సి.జయకృష్ణ, కార్యదర్శి బి.నగేష్, కోశాధికారి బి.జాబీర్, సభ్యులు సి.నాగేశ్వరరావు, ఇ.శ్రీరాములు, కె.సాయి హాజరయ్యారు.

## మండల పరిషత్ పాఠశాల పక్కన డంప్‌యార్డును తలపిస్తున్న చెత్తాచెదారం

ఉరవకొండ, డిసెంబర్ 2 ప్రభాతావార్త




ఇందిరానగర్‌లోని మండల ప్రాధమిక ఆదర్శ పాఠశాల పక్కన చెత్తాచెదారాన్ని చూపుతున్న జనసేన పార్టీ నాయకులు

పట్టణంలోని ఇందిరానగర్ కాలనీలోని మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాల పక్కన చెత్తాచెదారం నిండుకొని డంప్ యార్డును తలపిస్తోందని అయినా అధికారులు పట్టించుకోవడంలేదని జనసేన పార్టీ మండల అధ్యక్షుడు చంద్రశేఖర్ వాపోయారు. సోమవారం ఆయన పార్టీ స్థానిక నాయకులతో కలిసి చెత్తాచెదారాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాల పక్కన ఖాళీ ప్రదేశంలో చెత్తాచెదారంతో విద్యార్థులు, స్థానిక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నా మేజర్ గ్రామ పంచాయతీ పట్టించుకోవడంలేదన్నారు. పట్టణంలో 9,220 నివాసగృహాలు ఉండగా ఇంటికి 50 రూపాయల చొప్పున పారిశుద్ధ్య పన్ను వసూళు చేస్తున్న పంచాయతీ పారిశుద్ధ్యంపై మాత్రం దృష్టి పెట్టడంలేదని విమర్శించారు. 2023-24 సంవత్సరానికి పంచాయతీ నిర్వహించిన గ్రామసభలో పలు తీర్మాణాలు చేశారని ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు, సమర్థవంతమైన ఆరోగ్య పరిరక్షణకు చర్యలు తీసుకోవడం లాంటివి ఉన్నాయన్నారు. అయితే క్షేత్రస్థాయిలో మాత్రం నిర్లక్ష్యం కనబడుతోందన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు గుడిసెల రాజేష్, మల్లికార్జున, రమేష్, మణికుమార్, భోగేష్, వంశీ, జయకుమార్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## మానవసేవ మాధవ సేసవ

### - మాల దారణ భక్తాదులకు అన్నదానం

ధర్మవరం రూరల్, డిసెంబర్ 2 ప్రభాతవార్త



మాల ధారణ భక్తులకు అన్నదానం చేస్తున్న దృశ్యం, సన్మానిస్తున్న దృశ్యం


మావనసేవే మాధవసేవ అన్న నినాదంతో మాల ధారణ భక్తాదులకు గత 16 రోజు అన్నదాన కార్యక్రమాన్నిముఖ్య అతిథిగా ఆర్డిఓ మహేష్ విచ్చేశారు. బాబా దేవాలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు అందుకున్నారు. అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించి నిర్వాహకులు డోల రాజారెడ్డికి అభినందనలు తెలిపారు. అనంతరం బిజెపి నాయకులు రెడ్డి మాట్లాడుతూ.. మాల వేసిన భక్తాదులకు ఈ అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టడం నాకెంతో సంతృప్తిని ఇస్తోందని తెలిపారు. మాల ధారణ భక్తాదులకు ఇటువంటి సౌకర్యమును అవకాశం కల్పించిన ఆ భగవంతునికి నేను రుణపడి ఉంటానని ఆయన తెలిపారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులతో కలిసి ఆర్డిఓ మహేష్‌కు శ్యాలువాతో ఘనంగా సత్కరించారు.

## ఘనంగా కొండమ్మ మహాలక్ష్మి వేడుకలు

అగళి, డిసెంబర్ 2 ప్రభాతవార్త



కొండమ్మ మహాలక్ష్మి అమ్మవారి వేడుకలను ఘనంగా నిర్వహించారు. అరె సముద్రం గ్రామంలో వెలిసిన ఈ దేవతకు అగళి మండలంలో కూడా అధిక సంఖ్యలో భక్తులు ఉన్నారు. కంసలి వారికి ఇంటి దేవత కావడంతో కొండమ్మదేవతకు వెళ్లి ముఖ్యంగా మహిళా భక్తురాలు దీపాలను వెలిగించారు. దేవిని వివిధ రకాల పూలతో, ఆభరణాలతో అలంకరించారు. వేడుకలను ఆలయమండలి వారు నిర్వహించారు. వేదపండితులు తెల్లవారు జామునుంచే అభిషేకాలతోపాటు హోమాది కార్యక్రమాలు నిర్వహించారు. మహామంగళహారతి అనంతరం తీర్థప్రసాదాలను పంపిణీ చేశారు. ఆలయ మండలివారు పెద్దఎత్తున భక్తులకు అన్నప్రసాదాన్ని వితరణ చేశారు.



మహిళలు దీపాలు వెలిగించిన దృశ్యం

## కర్ణాటక మద్యంస్వాధీనం

పెనుకొండ డిసెంబర్ 2 ప్రభాతవార్త



స్వాధీనం చేసుకున్న మద్యంతో ఎక్సైజ్ పోలీసులు

నియోజకవర్గ పరిధిలోని సోమందేపల్లి మండలంలోని పాలసముద్రం క్రాస్ వద్ద ఎక్సైజ్ పోలీసులు సోమవారం దాడులను నిర్వహించి కర్ణాటక మద్యం స్వాధీనపరుచుకున్నారు గ్రామానికి చెందిన తిప్పయ్య ఇంటి ఆవరణంలో 1920 పెట్రా ప్యాకెట్లు పట్టుబడ్డాయి. పట్టుబడ్డ మద్యం విలువ 50 వేల రూపాయలు ఉంటుందని ఎక్సైజ్ సీఐ సృజన బాబు తెలిపారు. దాడులలో పట్టుబడిన తిప్పయ్యను అరెస్టు చేసి స్థానిక కోర్టులో హాజరుపరిచామన్నారు దాడులలో ఎక్సైజ్ ఎస్సైలు రాజశేఖర్ రాముడులు హెడ్ కానిస్టేబుళ్ల జనార్ధన్ రమేష్ కానిస్టేబుల్ ఈశ్వరులు పాల్గొన్నారు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్న మని తెలిపారు

## తూముచెర్లలో పాడి పశువులకు ఉచిత గర్భకోశచికిత్సా శిబిరం

కనగానపల్లి డిసెంబర్ 2 ప్రభాతవార్త



పాడి ఆవులకు చికిత్స చేస్తున్న డాక్టర్ లు సుధాకర్ , సునీల్ కుమార్, ప్రియదర్శిని.

మండలంలోని తూముచెర్ల గ్రామంలో సోమవారంఉచిత గర్భ కోశ చికిత్సా శిబిరం జిల్లా పశు గణాభివృద్ధి సంస్థ వారి ఉచిత మందుల సరఫరాతో ఏర్పాటు చేయడమైనది. 90 కచ్చితత్వంతో పేయి దూడలపుట్టుకను ఉద్దేశించి లింగ నిర్ధారిత వీర్యంతో కృత్రిమ గర్భధారణ చేయు పథకం ప్రాచుర్యని మిత్తం, ఆ పథకానికి మంచి పశువుల ఎన్నికకు, రైతుల అవగాహన కొరకు, గ్రామంలో అన్ని పశువులను పరీక్షించుట కొరకు ఉచిత గర్భకోశ చికిత్స శిబిరము ఏర్పాటు చేయడమైనది. మొత్తంగా పేయిదూడలను పొందే ఈ లింగనిర్ధారిత వీర్యం సూదులను ప్రభుత్వం వారు సరఫరా చేస్తున్నారని తెలిపారు. పుట్టేది పేయిదూడ కనుక ఈనునప్పుడు ఆవుకు కష్టం లేకుండా ఈనడం, పుట్టే పేయిదూడ చూడి నిలిస్తే 20శాతం అధిక పాలనిచే శక్తి కలిగి ఉండడం ప్రత్యేక లాభదాయకమైన అంశములని డి.ఎల్.డి.ఏ., అనంతపురం జిల్లా కార్యనిర్వహణాధికారి డాక్టర్ టి.వి.సుధాకర్ తెలిపారు. ఈ సందర్భంగా డిప్యూటీ డైరెక్టర్ డా సుధాకర్ మాట్లాడుతూ, భవిష్యత్తులో ఈ లింగ నిర్ధారిత వీర్యము అత్యధిక ప్రాచుర్యం పొందుతుందని, గ్రామములో అత్యధిక పాడి కొరకు పేయిదూడలు మాత్రమే పొందే ఆధునిక సాంకేతిక విప్లవముగా ఈ పథకం మారగలదని ఆశాభావం వ్యక్తపరిచారు. పశువులకు సరైన పోషణ కొరకు పచ్చి మేత, దాణాలతొ పాటుకొండచిగిరాకు,మునగాకు, కరివేపాకు, మొలకెత్తిన పెసలు, ఉలవలు, సద్దలు, రాగులు మేపినట్లైతే హార్మోన్స్ లోపం మరియు పోషకార లోపాలు లేకుండా చేసి, పశువులను త్వరగ చూలు కట్టించ వచ్చునని తెలిపారు.గర్భకోశ వ్యాధులతో ఉన్నవాటిని, ఎద లక్షణాల పశువులను, చూడి పశువులను చూపించి తగు జాగ్రత్తలు, నివారణోపాయాలు సూచిస్తూ, డాక్టర్ టి.వి.సుధాకర్ హాజరయిన రైతులకు, ఏ హెచ్ ఏ లు లకు, పశువైద్యులకు ప్రత్యేక శిక్షణ, మెలుకువలుతెలియచేసారు.ఈ కార్యక్రమంలో తగరకుంట పశు వైద్యురాలు డా ఏటి. ప్రియదర్శిని, మండల పశువైద్య అధికారి డా బి. సునీల్ కుమార్,తిబీత్బి, ఏ హెచ్ ఏ ఎస్ లు, గోపాలమిత్రాలు,తదితరులు పాల్గొన్నారు.

## ఆసుపత్రికి వెళ్లి ఫించన్ అందచేసిన సచివాలయం ఉద్యోగి

విడపనకల్లు, డిసెంబర్ 2 ప్రభాతవార్త



ఫించన్ అందచేస్తున్న సచివాలయం ఉద్యోగి

కర్నూల్‌లోని ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న లబ్దిదారురాలికి సచివాలయం ఉద్యోగి ఫించన్ మొత్తాన్ని అందచేసి మానవత్వాన్ని చాటుకున్నాడు. వివరాలు ఇలా వున్నాయి. విడపనకల్లు సచివాలయం-2 పరిధిలోని బెస్త హర్షిత కిడ్నీ సమస్యతో కర్నూల్ ఆసుపత్రిలో డయాలసిస్ చేయించుకుంటోంది. ఈ విషయం తెలుసుకున్న పంచాయతీ కార్యదర్శి మహబూబ్‌బాష సచివాలయం డిజిటల్ అసిసిస్టెంట్ నిఖిల్‌కుమార్‌ను సోమవారం కర్నూల్‌కు పంపి ఫించన్ మొత్తాన్ని లబ్దిదారురాలికి అందేలా చర్యలు తీసుకున్నారు. ఫించన్ సొమ్ము అందచేసిన డిజిటల్ అసిస్టెంట్ నిఖిల్‌కు హర్షిత కుటుంబసభ్యులు కృతజ్ఞతలు తెలుపగా గ్రామస్తులు అభినందించారు.

## శివారుకాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

గుంతకల్లు, డిసెంబర్ 2 ప్రభాతవార్త



కమీషనర్‌కు వినతిపత్రం అందచేస్తున్న దృశ్యం

పట్టణ శివారులకాలనీలైన గుజిరీకాలనీ, వినాయకకాలనీ, భీమిరెడ్డి నగర్ ప్రాంతాల్లో మౌళిక సదుపాయాలు కల్పించాలని సోమవారం ఎస్‌సి, ఎస్‌టి సంఘం నాయకులు మున్సిపల్ కమీషనర్ నయీమ్‌అహమ్మద్‌కు వినతిపత్రం అందచేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఆయా కాలనీల్లో దాదాపు 600 కుటుంబాలు నివాసం వుంటున్నాయన్నారు. సిసి రోడ్లు, డ్రైనేజీ, తాగునీరు. వీధిదీపాలు, తదితర సౌకర్యాలు లేక తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వర్షాకాలం వచ్చిందంటే ఇక్కడి ప్రజల అవస్తలు వర్ణనాతీమన్నారు. మట్టి రోడ్లపై వర్షం నీరు నిలిచి నడవడానికి తీవ్ర ఇబ్బందికరంగా మారిందన్నారు. సంబంధిత అధికారులు స్పందించి ఆయా కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సి, ఎస్‌టి రక్షణ సమితి అధ్యక్షులు మహేంద్ర, ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు భీమలింగ, నాయకులు కోరి చంద్రశేఖర్, రామాంజినేయులు, జక్కన్న, ఆయా కాలనీవాసుల ప్రజలు పాల్గొన్నారు.

## కొడవలితో గొంతు కోసుకుని ప్రాణం తీసుకోబోయాడు

గోరంట్ల, డిసెంబర్ 2 పభాతవార్త



ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన యువకుడు

మండలంలోని వెంకటరమణపల్లి పంచాయతీ పరిధిలోని పెరుమాళ్ల పల్లి గ్రామానికి చెందిన నరసింహులు అనే యువకుడు తన నివాసంలో సోమవారం కొడవలితో గొంతు కోసుకుని ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. ఈ సంఘటనను గమనించిన కుటుంబసభ్యులు హుటావుటిన గోరంట్ల ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమంగా వుండడంతో 108లో మెరుగైన వైద్యం కోసం హిందూపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన నరసింహులుకు భార్య శోభ వుంది. అయితే బాధితుడు గత కొంతకాలంగా మతిస్థిమితం సరిగాలేని విధంగా ప్రవరిస్తున్నాడని కుటుంబసభ్యులు తెలిపారు.

## అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే కఠిన చర్యలు. ఎస్సై

గుమ్మఘట్ట, డిసెంబర్ 02 ప్రభాతవార్త:



గ్రామస్థులకు అవగాహన కల్పిస్తున్న ఎస్సై ఈశ్వరయ్య

గ్రామాల్లో అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై ఈశ్వరయ్య అన్నారు. మండలంలోని గోనభావిలో స్థానిక ఎస్సై ఈశ్వరయ్య ఆధ్వర్యంలో కొత్త చట్టాలపై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో అందరూ సోదరాభావంతో మెలగాలని, ఎటువంటి గొడవలు పడకూడదని సూచించారు. గ్రామాల్లోనే సమస్యలు పరిష్కరించుకోవాలని, అక్కడ పరిష్కారం కానీ సమస్యలు, గొడవలు, పోలీసుల దృష్టికి తీసుకురావాలని చెప్పారు. గ్రామాల్లో గంజాయి, మత్తు పదార్థాలు అమ్మినా, కొనుగోలు చేసినా కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మధ్యం షాపులు వంటి వాటిని తయారు చేసినా, అమ్మినా నేరమని, అటువంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని చెప్పారు. అలాగే గ్రామంలో అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు ఎటువంటి సమస్యలు లేకుండా విగ్రహం ఏర్పాటుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు, పెద్దలు, యువకులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రతి కార్మికుడు లేబర్ గుర్తింపుకార్డులు తీసుకోవాలి

### -అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఏవి శివప్రసాద్

గుంతకల్లు, డిసెంబర్ 2 పభాతవార్త



ప్రభాతవార్తతో మాట్లాడుతున్న అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఏవి శివప్రసాద్

ప్రతి కార్మికుడు లేబర్ గుర్తింపుకార్డులు తీసుకోవాలని అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ ఏవి శివప్రసాద్ అన్నారు. సోమవారం పట్టణంలోని లేబర్ కార్యాల యంలో ఆయన ప్రభాతవార్తతో మాట్లాడుతూ భవనం, ఇతర నిర్మాణ రంగాల్లో పనిచేసే కార్మికుల సంక్షేమ కోసం 1996లో చట్టం చేయంబడిందన్నారు. గుర్తింపుకార్డు లు పొందిన ప్రతి కార్మికునికి చట్టపరిధిలో సంక్షేమఫలాలు అందుతాయన్నారు. 18 సంవత్సరాలుపైబడి 60 సంవత్సరాలలోపు వారు అర్హులన్నారు. కార్డు నమోదు చేసుకోవడానికి ముందు ఏడాదిలో 90 రోజులు తక్కువ కాకుండా భవన నిర్మాణరంగంలో పనిచేసి వుండాలన్నారు. గుర్తింపుకార్డు కలిగిన వారు ప్రమాదవశాత్తు మృతి చెందితే 5 లక్షలు, 50 శాతం అంగవైకల్యం సంభవిస్తే 2 లక్షలు, మహిళా కూలీలకు ప్రసూతిసాయం కింద 20 వేలు, సాధారణ మరణం సంభవిస్తే 60 వేలు, అంత్యక్రియల నిమిత్తం 10 వేల రూపాయలు సంక్షేమ బోర్డు ద్వారా అందచేయడం జరుగుతుందన్నారు. కార్డు వ్యవధి 5 సంవత్సరాలు వుంటుందని అనంతరం రెన్యువల్ చేసుకోవాల్సి వుంటుందన్నారు. ఈ విషయాలపై తమ పరిధిలోకి వచ్చే కార్మికులకు ఎప్పటిప్పుడు అవగాహన కల్పిస్తున్నామని ఆయన తెలియచేశారు.

## పిడిఎస్ బియ్యం అక్రమ రవాణా అరికట్టాలి

### -టిడిపి సీనియర్ నాయకులు కోడెల చంద్రశేఖర్

గుంతకల్లు, డిసెంబర్ 2 ప్రభాతవార్త



మాట్లాడుతున్న కోడెల చంద్రశేఖర్

పిడిఎస్ బియ్యం అక్రమ రవాణా అరికట్టాలని టిడిపి సీనియర్ నాయకులు కోడెల చంద్రశేఖర్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో గత మూడేళ్లలో 2 కోట్ల టన్నుల రేషన్ బియ్యం పోర్టుల నుండి అక్రమంగా రవాణా అయిందని ఆరోపించారు. బియ్యం మాఫీయాతో అప్పటి పాలకులకు సంబంధాలు వున్నాయని విమర్శించారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన బియ్యం మాఫియాపై ప్రత్యేక దర్యాప్తు సంస్థతో విచారణ జరిపించాలని కూటమి ప్రభుత్వాన్ని కోరారు. గతంలో తాను ప్రతిపక్షంలో వున్నప్పుడు అక్రమంగా తరలిస్తున్న బియ్యాన్ని అధికారులకు పట్టించిన ఘటనలు వున్నాయని గుర్తుచేశారు. ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి బియ్యం అక్రమ రవాణాపై ఎప్పటికప్పుడు తనిఖీలు నిర్వహించాలన్నారు. అలాగే స్థానిక అధికార యంత్రాంగం కూడా పిడిఎస్ బియ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆయన కోరారు.

## విద్యార్థుల సమయానికి అనుగుణంగా బడి బస్సులు నడపాలి. ఏఐఎస్‌ఎఫ్

రాయదుర్గం, డిసెంబర్ 02 ప్రభాతవార్త:



వినతిపత్రం అందజేస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు.

నియోజకవర్గ వ్యాప్తంగా విద్యార్థి సమయానికి అనుగుణంగా బడి బస్సులు నడపాలని ఏఐఎస్‌ఎఫ్ నియోజకవర్గం అధ్యక్షులు శశికుమార్ డిమాండ్ చేశారు. సోమవారం పట్టణంలోని ఆర్టీసి డిపో మేనేజర్‌కు బస్సులు సరైన సమయానికి నడపాలని కోరుతూ వినతిపత్రం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు బడి బస్సులు లేక చాలా మంది విద్యార్థుల చదువులు దూరం అయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. గతంలో ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో ఎన్నో ధర్నా కార్యక్రమాలు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని, కావున విద్యార్థులకు సమయానికి అనుగుణంగా బడి బస్సులు నడిపితే విద్యార్థులకు మంచి భవిష్యత్తు ఇచ్చినవాళ్లు అవుతారని తెలిపారు. పల్లె విద్యార్థులు ఉదయం ఏడు గంటలకి ఇంటి నుంచి బయలుదేరితే సాయంత్రం ఏడు గంటలకి లేదా ఎనిమిది గంటలకు వెళ్లే పరిస్థితి రాయదుర్గంలో నెలకొందన్నారు. పదవతరగతి పరీక్షలు దగ్గర్లో ఉన్నాయని, సమయానికి బడి బస్సులు లేక ఇంటికి వవెళ్లి చదువుకోవడానికి ఇబ్బందులు పడుతున్నారన్నారు. పదవతరగతి విద్యార్థులను మరియు మహిళా విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని విద్యార్థులకు సమయానికి అనుగుణంగా బడి బస్సులు నడపాలని తెలియజేస్తున్నామన్నారు. లేని పక్షంలో ఏఐఎస్‌ఎఫ్ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్ నాయకులు అభిషేక్, మున్నా, ప్రదీప్, భీమేష్, జగదీష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

